క్లుప్తంగా

సమష్టి కృషితోనే పర్యావరణ సమతుల్యత



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: పర్యావరణాన్ని కాపాడుకోలేక పోతే మానవజాతి మనుగడకే ప్రమాదమని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గాలి, నీరు నేల పంచభూతాలను మనిషి కలుషితం చేస్తున్నాడన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకం జరగాలని, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఆపాలని కోరారు. కార్యక్రమంలో కవులు, రచయితలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, చింతా ప్రభాకర్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో విత్తన బంతులు



మురళీనగర్ కొండ ప్రాంతంలో విత్తన బంతులు చల్లుతున్న మానవ సేవే మాధవ సేవ సభ్యులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా సహజసిద్ధ అడవులు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. సంఘ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం సభ్యులు విత్తన బంతులను మురళీనగర్ పరిసరాల్లోని కొండ ప్రాంతాల్లో విసిరి, కొన్ని చోట్ల రహదారులను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చింత, రాగి, జామ, మర్రి, సపోటా, దానమ్మ విత్తనాలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్, ఎస్.సీతారామకృష్ణ, ఉప కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరావు, కోశాధికారి కె.వి.వర్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఈపీఎఫ్, కరాసా, రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మర్రిపాలెం, వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల రోడ్డు, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం మెయిన్ రోడ్డు, గవరవీధి, గొల్లవీధి, రానాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్, భారత్ పెట్రోలియం బంక్ లైన్, రామాలయం వీధి, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న యల్లపు ప్రసాద్, చంద్రకళ దంపతులు, తదితరులు

అల్లిపురం: భూపేష్‌నగర్ దరి, బౌడరారోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు బులుసు రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అనంతరం అలంకరణ చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

- పర్యావరణ దినోత్సవంలో వక్తలు
- విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు



ఎస్‌ఎంసీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం రామ్‌ప్రసాద్, విద్యార్థులు



మురళీనగర్ వాకర్స్ పార్కులో మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

సీతమ్మధార: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ కొనసాగుతుందని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎస్‌ఎంసీహెచ్) ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం పీ అండ్ టీ కాలనీలోని పాఠశాల ఆవరణలో ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల నిషేధం పాటించాలని కోరారు. ప్లాస్టిక్ కాలుష్య భూతం నుంచి భూగోళాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. ఈ విషయమై విద్యార్థులంతా తల్లిదండ్రులను చైతన్యపరచాలని ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెండు ప్రసాద్, రాధాదేవి, కల్యాణి, గీత, భారతి, సంధ్యారాణి, సిబ్బంది, హైస్కూల్, ప్లస్ 1, ప్లస్ 2 విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటుదాం

మురళీనగర్: పరిసరాల్లో పచ్చదనం పెంపు ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పిలుపునిచ్చారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పచ్చదనం పరిరక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలని కోరారు. ఇది ఇంటి నుంచి ఒక ఉద్యమంగా ప్రారంభమవ్వాలన్నారు. పూర్వాధ్యక్షులు రాళ్లపల్లి సత్యనాథం మాట్లాడుతూ పర్యావరణ రక్షణకు వాకర్స్ క్లబ్ తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వివిధ రకాలకు చెందిన 300 మొక్కలు నాటారు. కార్యక్రమంలో పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, కె.ద్వారకానాథ్, కార్యదర్శి పి.చెల్వరాజు, ఉపాధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, కోశాధికారి జె.కూర్మారావు, సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, టి.వి.రమణ కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి ,ఎస్.రామ్మోహనరావు, రోణంకి నాగేశ్వరరావు, వై.దేముడు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ సంరక్షణ పరిశ్రమల బాధ్యత

పరిశ్రమలు స్థాపించిన యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నారావు తెలిపారు. కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. విద్యా సంస్థలు, ఇతర ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో తప్పనిసరిగా మొక్కలు పెంచాలన్నారు.

ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ నివారణకు మొక్కల పెంపకం ఒక్కటే సరైన మార్గమని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ డీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్(శిక్షణ) సిహెచ్.వి.సోమయాజులు పర్యావరణ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కెమికల్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు జేపీ రెడ్డి, దామోదర్, ప్రశాంతి, సీహెచ్‌ఎస్ ప్రసాదరావు, డి.తులసీరావు పాల్గొన్నారు.

ప్రకృతి ఆధారిత పంటలతో మేలు

విశ్వంలోని ప్రతి జీవి మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలిన వనమాలి గార్డెనర్స్ క్లబ్ చీఫ్ అడ్మిన్ అరవల అరుణ పిలుపునిచ్చారు. మురళీనగర్‌లోని సుదర్శన్ పార్కులో నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మన భూమి పరిరక్షణ అనే అంశంతో ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రకృతి ఆధారిత పంటలు పండించే విధానంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అడ్మిన్ మళ్ల సరిత మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో విశాఖ నగరంలో మిద్దె పంటల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం పిచ్చుకల గూళ్లు పంపిణీ చేశారు. పార్కులో 20 రకాల మొక్కలు నాటారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి, సుదర్శన్ పార్క్ ప్రతినిధులు ఎంఆర్‌కే రంగారావు, సి.శ్రీనివాస్‌రావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి ఆళ్ల పాటి శ్రీనివాసరావు, మినియేచర్స్ స్పెషలిస్ట్ రమాదేవి, వనమాలి గార్డనర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



గైస్‌లో మొక్కలు నాటి నీరు పోస్తున్న పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు



మహిళలకు పిచ్చుకల గూళ్లు అందిస్తున్న గ్రీన్ క్లైమేట్ టీం సభ్యులు

ఓడినా ప్రజలతోనే ఉంటా..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

- ప్రజా తీర్పు శిరోధార్యం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: విశాఖ అభివృద్ధి కోసం తన పోరాటం ఆగదని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పేర్కొన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను ఆరేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఓడినా సరే నిత్యం ప్రజల్లోనే ఉన్నానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఏమరుపాటుతో ప్రజలు తమను ఏమార్చారని పేర్కొన్నారు. ప్రజల తీర్పును స్వాగతిస్తున్నానని, ఓటమి మీద విశ్లేషణ చేస్తామన్నారు. విశాఖ అంటే తనకు పిచ్చి ప్రేమని, పాతికేళ్లుగా రాజకీయాలపై విశ్లేషణ, దినపత్రికలు చదవడం చాలా ఇష్టమని చెప్పారు. ఆ ఆసక్తితోనే ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాం

ఉత్తర నియోజకవర్గంలో ఆరేళ్లుగా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేశానని కె.కె.రాజు తెలిపారు. నియోజకవర్గంలో పలు పెట్టుబడుల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చామన్నారు. తన వ్యాపారం, వ్యక్తిగత జీవితం, కుటుంబం కన్నా ప్రజలతోనే ఎక్కువగా ఉన్నానని, ప్రతి గడపకూ వెళ్లానని చెప్పారు. అధికారం కోసం కూటమిలోని మూడు పార్టీలు అవలంబించిన విధానాలు ఫలించాయన్నారు. 2019 ఎన్నికల్లో సదరు మూడు పార్టీలకు పడిన ఓట్లు, ఈ సారి కూటమి రూపంలో కలిసి వచ్చిందన్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం వ్యవస్థ ద్వారా చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ నాయకులకు మధ్య సమన్వయ లోపం కారణంగానే ఎన్నికల్లో నష్టం కలిగిందని భావిస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన విష్ణుకుమార్ రాజును అభినందించారు. ఆరేళ్లలో తాను నిర్వహించిన ప్రతి కార్యక్రమం విజయవంతానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, మీడియాకు కె.కె.రాజు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బర్కత్ అలీ, సాడి పద్మారెడ్డి, ఉషశ్రీ, సారిపల్లి గోవింద్, అల్లు శంకరరావు, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ వుడా చైర్మన్ రవి, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉత్తర' అభివృద్ధికి కృషి చేస్తా..

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ విజేత, కూటమి బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు బుధవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీమణి సీతాసుజాత, కుమార్తె శ్యామలా దీపిక, అల్లుడు సునీల్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి స్వామికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎ.ఎస్.ఎన్.రాజు విష్ణుకుమార్‌రాజు దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు, కూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.



విష్ణుకుమార్‌రాజు దంపతులను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త, అర్చకులు

ఈదురుగాలుల బీభత్సం



తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న దుకాణాల వద్ద చెల్లాచెదురైన సామగ్రి



సత్యం జంక్షన్‌లో ఈదురుగాలులకు చిరిగిన ఫ్లెక్సీలు

సీతమ్మధార: నగరంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. తరువాత బలంగా ఈదురుగాలులు వీచాయి. వాటి ప్రభావానికి పలు ప్రాంతాల్లోని దుకాణాల వద్ద గల సామగ్రి చెల్లాచెదురైంది. చెట్లు ఊగిసలాడాయి. సత్యం తదితర జంక్షన్లలో హోర్డింగ్‌ల ఫ్లెక్సీ బ్యానర్లు చిరిగిపోయాయి. చెత్తాచెదారం రోడ్డుపైకి వచ్చేశాయి. కొద్దిపాటి వర్షం పడింది. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల నక్కవానిపాలెం దుకాణాల వద్ద ఉన్న సామగ్రి రోడ్డుపైకి చెల్లాచెదురుగా తుళ్లి పడింది. బాలయ్యశాస్త్రి లేఅవుట్, రాధాకృష్ణ లేఅవుట్, బిలాల్ కాలనీ, ఏఎస్సార్ నగర్, రేసపువానిపాలెం, గురుద్వారా పరిసర ప్రాంతాల్లో కొన్ని ప్రైవేట్ కేబుల్ సంస్థలకు చెందిన కేబుల్ వైర్లు రోడ్ల మీద తెగి పడ్డాయి. పార్క్‌చేసిన వాహనాలు సైతం ఈదురుగాలుల దాటికి పడిపోయాయి. రాకపోకల సమయంలో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు.

క్లాక్ టవర్ పనులు పరిశీలించిన కమిషనర్



క్లాక్ టవర్ పనులపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



లేపాక్షి జంక్షన్ వద్ద సర్కిల్ నిర్మాణంపై సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణలో భాగంగా జీవీఎంసీ జోన్ – 4 పరిధి జగదాంబ జంక్షన్‌లో నిర్మిస్తున్న క్లాక్ టవర్ పనులను బుధవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కూడళ్ల అభివృద్ధిలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఆకర్షణీయమైన క్లాక్ టవర్ నిర్మిస్తున్నామన్నారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, ఆకర్షణీయమైన రంగులు వేసి అందంగా తీర్చిదిద్ది, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగదాంబ జంక్షన్ రోడ్డు సెంటర్ మీడియన్‌లో ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరంగా చేసి ఆకర్షణీయమైన మొక్కలు నాటాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. లేపాక్షి జంక్షన్ వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా సర్కిల్ నిర్మాణ పనులు చేపట్టాలని, అలాగే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయడంతోపాటు కొత్త రోడ్డు జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజును ఆదేశించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పార్కుల్లో పిల్లల సందడి



జాకీర్ హుస్సేన్‌నగర్ గ్రీన్‌బెల్ట్ ఓపెన్ జిమ్‌లో ఆడుకుంటున్న చిన్నారులు, యువత



ఎఫ్‌సీఐ నగర్ పార్కులో చిన్నారుల సందడి

- వేసవి సెలవుల్లో ఆటవిడుపు
- ఓపెన్ జిమ్‌లో వ్యాయామాలు

మర్రిపాలెం: మండు వేసవిలో పచ్చని ఉద్యానవనాలు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు పార్కుల్లో చేరి ఆటపాటలతో సందడి చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ఉన్న పార్కులు, గ్రీన్‌బెల్ట్‌ల్లో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్‌లను జీవీఎంసీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వేసవి కాలం వాతావరణం మార్పులు, దానికి తోడు విపరీతమైన ఉక్కపోతతో ఈ ఏడాది ప్రజలు సతమతమవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు అంతా ఇంట్లో ఉండలేక కాసేపు బయటకు వచ్చి పార్కుల్లో వారి పిల్లలతో కలిసి గడుపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులు సందర్శకులతో కళకళలాడుతున్నాయి.

చిన్నాపెద్దల కేరింతలు

53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్ ఓపెన్ జిమ్, ఎఫ్‌సీఐ నగర్ ఎఫ్‌సీఐ పార్కు, 51వ వార్డు ఈస్ట్ పార్కులో చిన్నారుల సందడి అంతా ఇంతా కాదు. ఒక పక్క ఎంత వేడి ఉన్నా వారి ఆటలు వారివే. ఓపెన్ జిమ్‌లలో ఆడుకునేందుకు వీలుగా వ్యాయామ పరికరాలు ఉండటంతో కేరింతలు కొడుతూ వ్యాయామాలు చేస్తున్నారు.



కళింగనగర్ ఈస్ట్ పార్కు ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న పిల్లలు

పెద్దలు, పిల్లలు రోజూ సాయంత్రమైతే చాలు పార్కులకు వచ్చి కాసేపు సేద తీర్చుకుంటున్నారు.

ఆయా పార్కుల్లో పిల్లల ఆటలు, పెద్దల కేరింతలతో కోలాహలం నెలకొంటోంది. ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే జిమ్ పరికరాలతో ఎక్కువగా మహిళలు వ్యాయామాలు చేయడం, వాకింగ్ చేయడం ఎంతో విశేషం. ప్రస్తుతం ఈ పార్కులు ఉదయం 4 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు తెరిచి ఉండటంతో అందరూ వీటిని ఉపయోగించుకుంటున్నారు. కొద్ది రోజుల్లో వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో చిన్నరులు ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో పసుపు నీటితో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ముందుగా ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బిందెలతో పసుపు నీళ్లు తీసుకెళ్లి అభిషేకం చేశారు. ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం జరిపారు. సాయంత్రం 5 గంటల నుంచి కూడా అమ్మవారికి గంధం నీటితో అభిషేకాలు చేశారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు